# ఇలానే బాగుంది!

సృజన ప్రియ... జాతీయ క్రీడల ప్రత్యేక సంచిక



నల్లని కారుమేఘాలు కమ్ముకున్న ఆకాశవీధిలో జాబిలి తత్వాన్ని ఆహుతి చేసి, ప్రళయానికి నాంది పలికే ఉరుములు, మెరుపుల్లా ఉంది... ఆమె అంతరంగం! జీవనయానంలో ఒంటరి పోరాటం చేసి అలసిన అతివలా ఉన్న ఆమె ఆలోచనాంబరాల్లో ఎన్నో ఆలోచనలు..!

భవిష్యత్తు నిర్జీవమైన కఠినశిలలా ఎదుట నిలుస్తుంటే... దిక్కు తెలియని ఊహారేఖలు- అంధకారాన్ని సంతరించుకొని అగమ్యగోచరంగా కన్పిస్తున్నాయి.

ట్యూబ్‌లైట్ వెన్నెల కాంతిని ఆ గది తననిండా పరుచుకున్నా- ఆమె అంతరంగం మాత్రం చీకటితో నిండిన అనుభూతిని కలుగజేస్తోంది.

మనసు ఏకాంతాన్ని కోరుతున్నా... ఆలోచనల అలజడి గుండె తలుపుల్ని పదేపదే తట్టి సహనానికి పరీక్ష పెడుతున్నాయి.

హృదయానికి చేరిన నలత తనని పట్టి పీడిస్తుంటే మదిలో భావకుద్యాలు సంకోచిస్తున్నాయి. అంతలోనే మరలా వ్యాకోచిస్తూ తీరికలేని మనసులా పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయి.

"చరీ! గుండెల నిండా ఆత్మవిశ్వాసం ఉండాలేగాని- కొండల్ని పిండిచేయడం చాలా సులభం తెలుసా?"

- స్ఫూర్తివంతమైన శ్రీవత్సవ మాటలు గుర్తుకువచ్చేసరికి- ఆమెకు ప్రాణం లేచి వచ్చినట్లనిపిస్తుంటుంది.

"నువ్వు పచ్చి తిరుగుబోతువి. లేకపోతే ఆయనతో చెట్టాపట్టాలేసుకొని తిరగడమేమిటి?" ఇతరుల చాటుమాటలు ఆమెకు ఆవేదనను మిగులుస్తుంటాయి.

ఘనీభవించిన బాధల బరువులో ఒక ఆశారేఖ నిరంతర ప్రవాహంలో పడి కొట్టుకుపోతుంటే ఓ ఆధారం మనిషికి ముఖ్యం.

జీవితంలో ఎంత వెలుగును నింపుదామనుకున్నా ఆమెకు బ్రతుకు క్షణక్షణం చీకటికోణాన్ని ఆవిష్కరిస్తోంది. అనుభూతుల సాగరం ఒడ్డున నిలబడ్డ ఆమె- కెరటం వచ్చినప్పుడు కాళ్లక్రింద ఇసుక కదిలిపోతున్నా... కంగారు లేకుండా నిశ్చలంగా నిలబడాలనుకుంటుంది. ఆ కెరటం అనేది అశక్తురాలై తనని పట్టుకులాగలేక సిగ్గుతో వెనక్కిపోవాలని ఆశిస్తుంటుంది. కానీ, పిల్లకాల్వలు కూడా సముద్రంలా ఘోషిస్తూ తన వ్యక్తిత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

ఆహ్లాదమయమైన జీవితంకోసం బ్రతుకుబాటలోని ఆ వృక్ష శాఖోపశాఖల దాకా ఎగబ్రాకి, చిటారుకొమ్మ నుండి జారిపడ్డ ఆమె ఆ తప్పు మరలా పునరావృతం కాకూడదని ఆశిస్తుంటుంది.

ఇక, తన జీవితంలో అపోహలకు తావివ్వకుండా ప్రతినిముషాన్ని స్వర్గమయంగా మలచుకోవాలని తాపత్రయపడుతోంది. కానీ, జనారణ్యంలోని మనుషుల విషప్రవృత్తి తనని నిరంతరం అణచివేసి, వేదనకు గురిచేస్తూనే ఉంది.

ఫోన్ రింగ్ అవుతున్నా పెద్దగా ఆసక్తి కనబర్చని ఆమె- పట్టు వదలకుండా రింగ్స్‌బాణాల్ని సంధిస్తుంటే చివరికి అన్యమనస్కంగా లిఫ్ట్ చేయక తప్పలేదు.

"హాయ్ చరీ! ఏమిటీ... ఒంట్లో నలతగా ఉందా? ఎంతకీ రెస్పాన్స్ లేదు!"

"లేదు. మనసుకు నలత వేసింది."

"ఏమిటి? మొన్న నేను అడిగిన విషయం గురించా..?"

"అదేమీ కాదు!"

"మళ్లీ ఏమైంది?"

విషయం చెప్పింది.

"అవన్నీ మామూలే కదా డియర్! డోన్ట్ వర్రీ! అందుకే మనం ఓ నిర్ణయం తీసుకొని దానిమీద గట్టిగా నిలబడాలంటున్నాను. అప్పుడు ఇలాంటి సమస్యలన్నీ ఉత్పన్నం కావు."

"అదికాదు శ్రీ వీ!"

"ఏది కాదు? ఎవరో ఏదో అంటున్నారు అని, తలవంచుకొని మథనపడుతూ కూర్చుంటామా చెప్పు? దట్ టూ... పోస్ట్‌గ్రాడ్యుయేషన్ దాకా చదువుకున్నదానివి- నువ్వే ఇలా ధీలాపడితే ఎలా

చెప్పు? ముందు నువ్వు నీ మనసుకు జవాబుదారీగా నిలవాలి. సరే! నిన్న ఆడ్ అవర్స్ వరకు హోటల్‌లో టైం స్పెండ్ చేసి ఇంటికి చేరేసరికి అలిసిపోయి వుంటావ్... అవునా?"

"అలిసిపోవడాలూ, ఫీలవడాలూ ఏమీ లేవు. అసలు నాకేమీ అలాంటి ఫీలింగ్స్ లేకపోయినా- ఈ జనాల ఫీలింగ్స్‌ని తట్టుకోవడం కష్టంగా ఉంది. నీతో పరిచయం గట్టిపడిన తరువాత ఇక్కడ మా కాలనీవాసులు నాకిచ్చిన కితాబు ఏమిటో తెలుసా... నేను ఓ తిరుగుబోతునట!"

"నీ గురించి నువ్వేమనుకుంటున్నావ్?"

"హృదయం గాయపడిన ప్రతిసారీ నీ నుండి ఓ మంచిమాటను ఆశిస్తుంటాను. మధురమైన నీ ఓదార్పు ధోరణి నన్ను సేదదీరుస్తుంటుంది. నీ లాలింపు మాటలు నాపై నాకు కాన్ఫిడెన్స్ డెవలప్ చేస్తుంటుంది. ఇప్పుడు ఫోన్‌లో నీ మాటల రూపం వినిపించేసరికి- అంతవరకూ నిరాశ నీరెండలో ఉన్న నాలో ఆశాకిరణం వెలుగు చూస్తోంది. అద్సరేగాని- మరల ఎప్పుడు మన కలయిక?"

"ముందు నీ నోట ఆ మధురమైన మాట విన్న తరువాత!"

"చెప్తాగా! ఆలోచించుకోవడానికి కొంతసమయం తీసుకోనీ బాబూ..!"

"రేపు సండే యాదగిరిగుట్టకు ప్లాన్ చేస్తున్నాను. నీకు ఆఫీసులో ఎడిషనల్ వర్క్ ఏమీ ఉండదు కదా!"

"ఆదివారం వరకూ వెయిటింగా..? నెవర్! రేపు ఈవెనింగ్ మహేశ్వరిలో ఫస్ట్‌షో పిక్చర్ చూస్తున్నాం. తర్వాత తాజ్‌లో డిన్నర్‌చేసి డిస్పర్స్ అవుతాం... సరేనా?!"

"ష్యూర్... అండ్ టిల్ దెన్ గుడ్‌నైట్!"

శ్రీవాత్సవ ఫోన్‌కట్ అయిపోయింది. ఎందుకో- ఆ రూమ్‌లో పరుచుకున్న ట్యూబ్‌లైట్ కాంతి కొన్నివేల లక్స్ పెరిగినట్లనిపించింది ఆమెకు. తరువాత ఆలోచించుకుంటే తెలిసింది. పెరిగింది వెలుతురు కాదనీ, తన థింకింగ్ పర్‌స్పెక్టివ్ అని!

చరితకు ఇది మామూలే! ఎవరో ఏవో అన్నమాటలు విని నొచ్చుకోవడం, తరువాత తమాయించుకోవడం, నొచ్చుకున్న ప్రతిసారీ వాత్సవ పిలుపుకోసం ఎదురుచూడడం... ఆమెకు అలవాటయిపోయింది.

"అమ్మగారూ! గిన్నెలన్నీ శుభ్రం చేసి పెట్టానమ్మా! పాలు కాచి తోడుపెట్టి ఫ్రిజ్‌లో పెట్టాను. పేపర్‌బోయ్ బిల్లుకోసం వస్తే 'అమ్మగారు లేరు రేపు రమ్మ'ని చెప్పాను."

పనిమనిషి రమణమ్మ పిలుపు విని- "సరేలే! పొద్దుపోతోంది కానీ, త్వరగా ఇంటికి వెళ్ళు. ఈరోజు ఆకలిగా లేదు. ఎందుకో తలనొప్పిగా వుంది. రైస్, అరటికాయ ఫ్రై, రసం, కుక్కర్‌లో పెట్టాను. నేను తినలేనుగానీ, నువ్వు తీసుకుపో!" అంది చరిత.

"అదేమిటమ్మా! ఏవో, ఎవరో అన్నవన్నీ మనసులో పెట్టుకొని తిండి మానేసి కూర్చుంటే ఎలాగ చెప్పండి? మీరేమీ అనుకోకుంటే చిన్నమాట... ఆ వాత్సవ బాబుతో నిన్న కనిపించారట! గోరంతలు కొండంతలు చేసి ఆ మూర్తి అమ్మగారు, మధుసూదన అమ్మగారు ఒకటే చెవులు కొరుక్కుంటున్నారమ్మా! వినలేక ప్రాణం చచ్చిపోయింది అంటే నమ్మండి. మీకంటే వయస్సులో పెద్దదానిగా చెబుతున్నాను- ఎంతకాలం ఇలా ఒంటరిజీవితాన్ని గడుపుతారు చెప్పండి? ఎవరో ఒకరి చేత తాళి కట్టించుకొని వీళ్ళ నోళ్లు మూయించవచ్చు కదమ్మా!"

"ఇంకేమి అన్నారు?" ఒకింత ఉత్సాహాన్ని చూపిస్తూ అంది చరిత.

"నీవు ఎటువంటిదానవో నాకు తెలుసమ్మా. కానీ, లోకులు కాకులు... ఒంటరిగా ఉన్న ఆడదాన్ని చూసేసరికి వాళ్ళ నోళ్లకి అడ్డూ, ఆపూ ఉండవు. అయినా మీ మంచి కోరినదానిగా చెబుతున్నాను- మీ మనసులో ఆ శ్రీవాత్సవబాబు ఉన్నారని తెలుసు. ఆ బాబునే చేసుకుంటే పోలా..?! చూస్తుంటే మనిషి నెమ్మదస్తుడు, చాలా మంచివాడుగా కనబడతారు."

"సరేలేవే! నా గురించి నాకు తెలియదంటావా? ఎవరో, ఏదో అనుకుంటున్నారని నేనేమి చేసేది చెప్పు?" విషయాన్ని సున్నితంగా ముగించేసరికి, రమణమ్మ- 'ఈ అమ్మ ఇంతేలే...' అనుకుంటూ ముందుకు సాగిపోయింది.

చరిత, శ్రీవాత్సవల అఫైర్ గురించి ఉన్నది లేనట్టుగానూ, లేనిది ఉన్నట్టుగానూ, చర్చించుకోవడం ఆ కాలనీవాసులకు మామూలైపోయింది. కాలక్షేపం కోసం కబుర్లు వెతుక్కునేవారికీ, ఎదుటివారిలోని సున్నితత్వాన్ని ఎనలైజ్ చేసుకుని ఎంజాయ్ చేసేవారికీ- వారి స్నేహం అలంబన అయ్యింది. సాధారణంగా అడ్డూ,ఆపూ లేని మనుషుల కంటికి ఒక ఆడ-మగల స్నేహం కనిపిస్తే వారి రాంగ్‌థింకింగ్‌కి అవకాశం ఏర్పడుతుంది.

"వాడికి మేనర్స్ లేకపోతే, కనీసం దానికైనా సిగ్గు ఉండక్కర లేదూ?! పరాయి మగాడితో మరీ ఇంత బరితెగించి తిరగడమా? మొన్నటికి మొన్న ఎమైందనుకున్నావు? మా ఆయన ఊరెళ్లబోతుంటే అర్ధరాత్రి లేచి తలుపు తీశాను. ఆ 12 గంటల వేళ వీడికి ఆనందంతో సెండాఫ్ ఇస్తోంది. సంసారం చేసుకొనే మనలాంటి వాళ్ళమధ్య ఈవిడ్ని ఉండనిస్తే మన మొగుళ్ళు కూడా ఇటువంటి చోద్యాలకు అలవాటు పడతారు."

"మొన్న మా కుటుంబమంతా కలిసి సినిమాకు వెడితే- అక్కడా వీళ్ళిద్దరూ ప్రత్యక్షమయ్యారు. ఏమి ఇకఇకలూ... ఏమి పకపకలూ చెప్పు? 'చూసేవాళ్ళు ఏమనుకుంటారో...' అనే జ్ఞానం వాళ్ళకి లేకపోయినా- చూడలేక సిగ్గుతో కుంచించుకుపోయాను తెలుసా?!" తన పరోక్షంలోని ఇరుగుపొరుగు అమ్మలక్కలు అంటున్న సూటిపోటి మాటలు చరిత అంతరంగాన్ని తాకి, అతలాకుతలం చేస్తూనే ఉంటాయి. ప్రతిసారీ ఆవేదనతో అల్లాడుతుంటుంది.

'నా జీవితం నా యిష్టం... నా వ్యక్తిత్వం నాది... నా అనుభూతుల్ని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు' తనకు తానుగా సర్దిచెప్పుకుంటుందే కాని, తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకోలేక పోతోంది.

శ్రీవాత్సవ మంచివాడు, పైగా ఉన్నతుడు! అటువంటి వ్యక్తితో తనకున్నది అక్రమ సంబంధమా? తను, తన జీవితం, ఆరాధనాభరితమైన స్నేహలత నిరంతరం అతని చుట్టూ అల్లుకుంటూనే ఉంటాయి. అతని బాహుబంధంలో గువ్వలా ఒదిగిపోయే ప్రతిసారీ ఈ లోకాన్నే జయించినట్లు, తనకిక ఎవరితోనూ పనిలేనట్లు, ఎవరి మాటలూ తనకు లెక్కలేనట్లుగా భావిస్తుంటుంది.

అతనూ అంతే! అవిరళమైన ప్రేమానురాగాన్ని ఒలకబోస్తుంటాడు. చరిత అంటే అతనికి ప్రాణం! పసిడితనాన్ని ఆపాదించుకున్న బంగరుబొమ్మను అక్కున చేర్చుకున్న ప్రతిసారీ శ్రీవాత్సవ హృదయం పులకిస్తుంటుంది. మనసు గతిని నిర్దేశిస్తుంటుంది. పూలరథం లాంటి పడుచుదనాలు, శయనాదివాసం వైపు అడుగులు వేస్తుంటే- తనువులు తపనచెందుతాయి, మనసులు సేదతీరుతాయి.

లోకానికి, సంఘానికి అతీతంగా తమకు ఇంకేం పట్టనట్లు, ఇంకెవరితోనూ సంబంధం లేనట్లు, ఒకరికొకరు పెనవేసుకుపోతున్న శ్రీవాత్సవ, చరితల గురించి నాలుగు మాటలు చెప్పడం కోసం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళుతున్నాను...

• • •

"ఏరా శ్రీవూ! అమ్మాయిపై నీ అభిప్రాయం ఏమిటి? నచ్చిందా, లేదా? ఆలోచించుకుని విషయం చెబితే మునిస్వామిగారికి తెలియజేస్తాను" తండ్రి జగన్నాథం అంటుంటే...

"అమ్మాయికేమండీ... కుందనపు బొమ్మలా ఉంటేనూ?! నచ్చకపోవడానికి అందచందాలు తక్కువా, చదువుసంధ్యలు తక్కువా? అయినా- వాడు నా కొడుకు. నా మాట ఎప్పుడూ జవదాటడు!" వాషింగ్‌మెషిన్‌లో బట్టలు పడేసి, వీల్‌పౌడర్ వేస్తూ అంటున్న తల్లి మాటలు వింటున్నాడు శ్రీవాత్సవ.

"మునిస్వామిగారు మంచి పలుకుబడిగల వ్యక్తి. అటువంటి పెద్దింటి అమ్మాయి మనింటికి కోడలుగా రావడం నిజంగా అదృష్టం. అయినా మన నిర్ణయాన్ని తెలియజేస్తే వారు మరో సంబంధం చూసుకుంటారు."

"నేను మీ మాటనీ, మమ్మీ మాటనీ ఎప్పుడు కాదన్నాను నాన్నా? అమ్మాయి నాకు బాగానే నచ్చింది. తరువాత మీ నిర్ణయమే నా నిర్ణయం!" ఆఫీసుకు వెళ్లే హడావిడిలో బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని, కాళ్లకి షూస్ వేసుకుంటూ అంటున్న కొడుకు మాటలు జగన్నాథం, ప్రభావతిలకు ఆనందం కల్గించాయి.

"అయితే... నాన్నగారు తాంబూలాలు తీసుకొనేందుకు ముహూర్తం పెట్టించమని పెళ్ళివారికి కబురుపెడతారు!" '

కొడుకు ఎక్కడ కాదంటాడో...' అనే ఆతృతతో అంటున్న తల్లిని ఉద్దేశించి-

"మమ్మీ! నేను నువ్వన్నట్లు నీ కొడుకుని. నీ మాట, డాడీ మాట ఎప్పుడు కాదన్నాను చెప్పు? ఆటపాటల్లో కానీ, చదువుసంధ్యల్లో కానీ మీ నిర్ణయం నాకు కలిసివచ్చిందేగాని ఎప్పుడూ నాకు అసంతృప్తిని మిగల్చలేదు. అలాగే నా పెళ్ళివిషయం కూడా! నా మనసులో ఇంతవరకూ ఏ అమ్మాయీ లేదు. కానీ, 'నాకు కాబోయే భార్య ఇలా ఉండాలి' అనే అభిప్రాయాలు మటుకు ఉన్నాయి. నేను ఊహించిన లక్షణాలన్నీ చరితను చూడగానే ఆమెలో ఉన్నాయనిపించింది. అందం, ఒకింత అతిశయం, చదువు, వ్యకిత్వం, డాబు దర్పం... అహం!

ఆడది మరీ పూర్వకాలపు మనిషిలా, భర్త అడుగులకు మడుగులు ఒత్తనవసరం లేదని నా అభిప్రాయం. ఎందుకో- నేను అనుకున్న అమ్మాయిని చరితలో చూడగలిగాను. అప్పుడనిపించింది- 'తల్లిదండ్రుల మాట చద్దిఅన్నం మూట' అని! కానీ, ఆ మూటలో ఉన్నది చద్దిఅన్నం కాదు, పంచభక్ష్య పరమాన్నాలున్నాయని అనుకుంటున్నాను" లాలనగా తల్లి భుజాలు కుదిపి ఆనందంగా స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్లిపోతున్న కొడుకుని చూసి, 'వీడు నా కొడుకు' అని మనసులోనే మురిసిపోయారు జగన్నాథంగారు.

అందరి అభీష్టం మేరకు చరితా, శ్రీవాత్సవల వివాహం వైభవోపేతంగా జరిగిపోయింది.

శ్రీవాత్సవ తాను పనిచేస్తున్న 'ప్రగతి రియల్ ఎస్టేట్'లోని ఉద్యోగులందరికీ డిన్నర్ ఏర్పాటుచేసి, భార్యను పరిచయం చేశాడు.

"అమ్మాయి నీకు తగిన భార్య! విషింగ్ ఏ హ్యాపీ అండ్ పీస్‌ఫుల్ వెడెడ్ లైఫ్!" తన ఎం.డి.గారు అభినందిస్తుంటే ఆనందంతో పులకించిపోయాడు.

చరిత అందం, చొరవ, పట్టుదల కలబోసిన విద్యాధికురాలు.

"నేను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాను గదా! ఇంట్లో ఊరకే కూర్చోవడం చాలా బోర్‌గా వుంది. నాకు కూడా ఏదైనా ఉద్యోగం చేయాలని కోరిక! అవకాశం ఉంటే చూడకూడదూ?"

"నీకు ఉద్యోగం సంపాదించడం పెద్ద కష్టం కాదు. కానీ, అయినింటి అమ్మాయి అలసిపోతుందని నా ఉద్దేశం. అందులోనూ మునుస్వామిగారి గారాల పట్టివి!"

"అలసిపోవడం లేదు, సొలసిపోవడం లేదు. అయినా మీ ఆఫీసులో క్యాషియర్ పోస్టొకటి ఖాళీగా ఉందని మొన్న అన్నారు కదా! మీ మేనేజర్‌గారు సహృదయులుగా కనిపిస్తున్నారు. ఆ పోస్ట్ నాకు వచ్చేటట్లు చూడకూడదూ?"

మొత్తానికి శ్రీవాత్సవ కృషితో 'ప్రగతి రియల్ ఎస్టేట్'లో ఉద్యోగం సంపాదించగలిగింది చరిత.

"లాస్ట్ ఫైనాన్షియల్ ఇయర్‌లో మన కంపెనీ పనితీరు పెద్ద ఆశాజనకంగా లేదు. కస్టమర్స్ సంఖ్య కూడా తగ్గుముఖం పట్టడంతో- కొత్త వెంచర్స్ స్టార్ట్ చేయాలంటే ఆలోచించవలసి వస్తోంది. ఈ క్రిటికాలిటీ నుండి ఓవర్‌కమ్ కావడానికి ఎంప్లాయ్స్‌గా మీనుండి మంచి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాను" ఒకసారి ప్రగతి రియల్‌ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టరు తమ ఉద్యోగస్తులనుద్దేశించి అనేసరికి-

"సార్... నాదొక సలహా! మన మంత్లీ ప్రీమియమ్ ఎమౌంట్స్ ఎక్కువ. కాలపరిమితి తక్కువ. అందుచేత మన వెంచర్స్ అధిక ఆదాయపరులు అందుకోగలుగుతున్నారు గాని- మధ్య, అల్ప ఆదాయ వర్గాలకు అందుబాటులో ఉండటం లేదు. అదీగాక, మనకు ప్రాఫిట్ మార్జిన్ ఎక్కువ. అది వీలైనంతవరకూ తగ్గించుకోవలసిన అవసరం ఉంది. మంత్లీ ప్రీమియమ్ తగ్గించి, ఇతర ప్రోత్సాహక బహుమతులు ప్రకటించి, ఇన్‌స్టాల్‌మెంట్ కట్టవలసిన నెలలు ఎక్కువ చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది. పదికాలాలపాటు బిజినెస్‌లో రాణించగలుగుతాం అని నా ఉద్దేశ్యం!"

చరిత మాటలు ఎం.డి.గారికి బాగా నచ్చాయి. ఇంతకాలం తాము ఎందుకు వెనకబడి పోతున్నామో గ్రహించగలిగిన ఆయన- ఆమె సూచనలు, సలహాలు పాటించడంతో బిజినెస్ అభివృద్ధి పథం వైపు పయనించసాగింది.

"చరితా! నీ సూచనలు పాటించడం వలన మన కంపెనీకి చాలా లాభం చేకూరింది. బిజినెస్‌ని యథాస్థానంలో నిలుపగలిగాం. స్ఫూర్తివంతమైన సలహాలనందించిన నీకు ఇకనుండి అదనపు బాధ్యతను అప్పగింపతలచాం. నిన్ను ఎకౌంట్స్ హెడ్‌గా ప్రమోట్ చేస్తున్నాను."

అనతికాలంలోనే భార్యకు గుర్తింపు రావడంతో ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు శ్రీవాత్సవ.

"చరీ! నీ చొరవ, కృషి, పట్టుదల నిన్ను పైకి తీసుకువచ్చాయి. ఇప్పుడు నీకు అసిస్టెంట్‌ని కావడం- నాకు ఎంత ఆనందంగా ఉందో తెలుసా?!" ఇంట్లో కాఫీ తయారుచేసి ఇస్తున్న భార్యను ఉద్దేశించి లాలనగా అనేసరికి-

"అంతా మీ ప్రోత్సాహం తప్ప దీనిలో నేను చేసింది ఏమీ లేదు. సిన్సియారిటీతో వర్క్ చేస్తే సక్సెస్ తనంతట అదే వెతుక్కుంటూ వస్తుంది" అంది.

క్రమంగా చరిత ఆ ఆఫీసులో కీలకమైన వ్యక్తిగా మారిపోయింది. క్రిటికల్ డెసిషన్స్ తీసుకోవాలన్నా, బిజినెస్‌ని ప్రమోట్ చేయాలన్నా ఆమె మాటకు మంచి విలువ లభిస్తోంది. తక్కువకాలంలో ఎక్కువ ప్రమోషన్స్ సంపాదించగలగడంతో శ్రీవాత్సవ సబార్డినేట్ స్థాయి నుండి బాస్ స్థాయికి ఒక్కసారిగా ఎదిగిపోయింది.

ఊహించని తన స్థాయికి ఆమె ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా- నాణానికి రెండోవైపును ఊహించలేకపోయింది. భార్య ఉన్నతిని ఒక స్థాయి వరకూ యాక్సెప్ట్ చేయగలిగిన శ్రీవాత్సవ సడెన్‌గా ఆమె సబార్డినేట్‌గా పనిచేయవలసి రావడంతో- అతనిలో అంతవరకూ నిద్రాణమైవున్న పురుషాధిక్యత పంజా విప్పడం మొదలుపెట్టసాగింది. భార్యపై అంతవరకూ ఉన్న ప్రేమ, అనురాగం క్రమంగా అంతమవసాగాయి. వాటి స్థానంలో ఈర్ష్య, అసూయలు రూపం సంతరించుకోసాగాయి.

భర్త ధోరణి మొదట్లో వింత అనిపించినా- అతని ప్రవర్తన, మాట్లాడే తీరు చరితను ఎంతగానో బాధించసాగాయి. ఎప్పుడూ ఆఫీసు అవ్వగానే ఠంచనుగా ఇంటికి వచ్చే శ్రీవాత్సవ ఇప్పుడు చాలా ఆలస్యంగా వస్తున్నాడు. ఏవో సాకులు చెబుతూ అన్యమనస్కంగా ఉంటాడు. ఇంట్లో ప్రతి చిన్నవిషయానికీ విపరీతంగా అర్థాలు తీస్తూ రాద్ధాంతం చేస్తుంటే ఆమె విసిగిపోయేది.

"నిన్ను పెళ్ళిచేసుకుని తప్పు చేశాను... నీకు ఉద్యోగం ఇప్పించి రెండోసారి పొరబాటు చేశాను. మా అమ్మానాన్నల మాటని గౌరవించి నీ మెడలో తాళికట్టాను. ఇప్పుడు నీ అతిశయం, డాబూ, దర్పం, అహంకారం, ఆఫీసులో భర్త అనే గౌరవం లేకుండా ప్రవర్తించడం... అనేవి సహించరాని విషయాలు. అందుకే నిన్ను భార్యగా ఊహించుకోవడానికి ఎంతగానో బాధ పడుతున్నాను."

భర్త అంటున్న ద్వేషపూరితమైన మాటలు ఆమెలో ఉద్రేకాన్ని కలుగజేస్తున్నాయి. అతని అంతరంగం అంతా ఈర్ష్యతో నిండిపోయివుంది. అతనికన్నా పైస్థాయిని సంపాదించగల్గినా ఆయన ఈగోని ఎప్పుడూ కించపర్చలేదే! ఆఫీసులో తన పని తాను చేసుకుపోతుందంతే! కానీ, శ్రీవాత్సవలో ఏమిటీ మార్పు? ఆ ప్రేమ, అనురాగం ఏమైపోయినట్లు?

'చరీ! అందం, అతిశయం, నలుగురిలో చొచ్చుకుపోగల నేర్పు... అన్నీ నీకున్నాయి. నేను నీలో మెచ్చిన అంశాలు ఇవే! ఆడది ఎప్పుడూ అణగారినతనాన్ని సంతరించుకోకూడదు. పురుషాధిక్యానికి సవాలుగా నిలవాలని నా కోరిక!'

- ఆలోచిస్తున్న చరితకు అతనిపై అసహ్యం కలగసాగింది. ఒకరి అధిక్యాన్ని, ఆధిపత్యాన్ని భరించలేని నైజంతో ఎంతకాలమిలా సర్దుకుపోగలదు? దానికి భర్త కూడా మినహాయింపు కాదేమో!

అజ్ఞానమయమైన అర్థంలేని మానసిక సంఘర్షణ వారి వైవాహికబంధాన్ని విచ్ఛిన్నం చేసింది. చిలికిచిలికి గాలివానై, ఆ తుపానులోపడి వారి అనురాగ నావ కొట్టుకుపోసాగింది. చివరికి పొసగని వారి దాంపత్య బంధం విడాకులతో తెరపడింది.

చరిత నుండి విడాకులు తీసుకున్న శ్రీవాత్సవ, ప్రగతి రియల్ ఎస్టేట్ నుండి వైదొలగి హైదరాబాద్‌లో మరో జాబ్‌లో చేరాడు.

చరిత కాలక్రమంలో గుంటూరు బ్రాంచి నుంచి ప్రమోషన్ మీద హైదరాబాద్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ కాబడింది.

కదులుతూ ముందుకు పరుగులు తీస్తున్న కాలం- కఠిన శిలల్ని కూడా కరిగిస్తుందట!

శిథిలమైన అనుభూతులతో రాటుదేలిన వ్యక్తిత్వాలు, అనురాగాలు- కరిగే కాలంతో సజీవ రూపాలుగా రూపాంతరం చెందసాగాయి. శిశిర జీవనంలో క్షణిక ఆవేశంతో, అహం మాటున మరుగునపడిన వారి వైవాహిక జీవన స్రవంతి- వసంతపు పూతల క్రొత్తదనాలను సంతరించుకోసాగింది. పంతాలు, పట్టుదలలు చల్లారి, మబ్బులమాటు వెలుగురేఖలు ఉదయించసాగాయి.

విడాకులు తీసుకుని 'మాజీ'లైన దంపతులు- తమ పొరపాట్లను గుర్తించసాగారు. వారి హృదయాలు సెకండ్ ఇన్నింగ్స్ వైపు మొగ్గుచూపసాగాయి. ఇద్దరిలోనూ నెలకొన్న నిజాయితీ, వైవాహిక జీవితం, సంస్కృతి, సాంప్రదాయాలపై గౌరవం కలవారు కావడంతో- వారి వారి నిశ్శబ్ద జీవితాలు మరో తీరం వైపు తొంగిచూడలేదు.

తోటి ఉద్యోగులు తమను సెకండ్‌మ్యారేజి చేసుకోమని ప్రోత్సహించినా- 'ససేమిరా...' అని త్రోసిపుచ్చేవారు. ఆరిపోని వారి అనురాగ దీపపు వెలుగు- వారికి మార్గాన్ని నిర్దేశిస్తూనే ఉండేది.

'ఎంత ఎడమైతే అంత తీపి కలయిక!' అని ఒక మహాకవి అన్నట్లు- దూరం వారి మధ్య అంతరాన్ని తగ్గించసాగింది. ఒకరిపట్ల మరొకరికి ప్రేమానురాగాలు మొగ్గ తొడిగి వికసించసాగాయి.

అతను ఉండేది దిల్‌సుఖ్‌నగర్, ఆమె నివసించేది సనత్‌నగర్‌లో! అయినా... ఆయా నగర్‌లు వారికి ప్రేమనగరులై జీవన సంధ్యలోని మాధుర్యాన్ని మరోమారు రుచి చూపించసాగాయి. క్రమంగా అవధులు దాటిన అనురాగం పెనవేసుకురాగా వారి మధ్య ఒకరిని విడిచి మరొకరు ఉండలేని గాఢత నెలకొంది.

ఇరుగుపొరుగువారు, ఆఫీసులోని వారు 'ఒకప్పుడు వివాహమై, విడిపోయిన మాజీ దంపతులు' అని తెలిసినా- వారిది 'అక్రమ సంబంధ'మని ఐ.ఎస్.ఐ. మార్కు వేసి, చాటుమాటు గుసగుసలతో, పొగరాని పొయ్యిలతో సైతం ధూమతెరలను సృష్టించి పరిపక్వమైన వలపు వీచికను అతలాకుతలం చేసేవారు.

"శ్రీవూ! చూశావా... జీవితాన్ని పంచుకున్న తరువాత కూడా ఎన్ని అవాంతరాలని ఎదుర్కోవలసి వస్తోందో?! తాళికట్టిన భర్తతోటి సహజీవనాన్నే కించపరుస్తున్న ఈ మానవ మృగాలు- అవి నివసించే ఈ జనారణ్యానికి దూరంగా ఈ ఒంటరి మనసు, ఏకాంత వాసాన్ని కోరుతోంది!" ఆవేదనా భరితంగా మాట్లాడుతున్న విరజాజిలాంటి భార్యామణిని అక్కున చేర్చుకుని-

"పిచ్చి చరీ! మనిషిలోని బలహీనతల మీద, సున్నిత భావాల మీద ఆధిపత్యం చెలాయించి, పబ్బం గడుపుకోవాలనుకునే పాడులోకం ఇది! మనకిప్పుడు ఏం తక్కువ చెప్పు? ఎప్పుడో మనల్ని కాలం విడదీసినా- ఆత్మాభిమానం, ఆశయాలు, అతిశయాల మధ్య వారధిలా నిలిచింది.

ఆనాడు కాదనుకుని విడిపోయాం. తప్పు ఇద్దరిలోనూ ఉంది. నీ ఆర్థిక స్వావలంబన నిన్ను అటు లాగితే, నా మానసిక స్థితి నన్ను- 'మాజీ'లన్న పేరును స్థిరం చేసుకున్నాం. కానీ, 'ఎంత ఎడమైతే అంత తీపి కలయిక'లా విడదీసిన కాలమే ఇద్దరినీ హైదరాబాద్‌కి చేర్చింది.

ఇక్కడ మొదటిసారి నిన్ను చూసిన తరువాత- శారీరకంగా మనం అంతరాన్ని పాటిస్తున్నా... మానసికంగా నాకు దగ్గరగానే ఉన్నావన్న విషయాన్ని గ్రహించి పొంగిపోయాను. నీలాంటి మానవతామూర్తిని తూలనాడిన నా అవివేకానికి సిగ్గుపడ్డాను. ఆ క్షణం నుండి నా మనసు నీ పొందుకోసం పరితపించింది. నీతో కలిసి మాట్లాడాలనీ, కలిసి తిరగాలనీ, జీవితాన్ని మళ్లీ పంచుకోవాలనీ హృదయం ఉవ్విళ్ళూరింది. మనఃస్ఫూర్తిగా నేను నీకు దగ్గరయినప్పుడు- పరాయి మనుషుల మాటలు గాలిమాటలు తప్ప, మనల్ని ఏమీ చేయలేవు. కాబట్టి వాటిని పట్టించుకోవడం మానేస్తే సరి!"

"శ్రీవూ! ఆనాడు భర్తగా వచ్చిన నిన్ను చూసి మురిసిపోయాను. ఆశల స్వప్నాన్ని నిజం చేసి, అనురాగ తీరాన్ని చేర్చావని పొంగిపోయాను. కానీ, ఆ క్షణంలో ఏదో దుష్టగ్రహ కూటమి మనల్ని పట్టి పీడించింది. లేకుంటే నేను ఉద్యోగంలో చేరితే పొంగిపోయిన నువ్వు- తరువాతి కాలంలో నా ఉన్నతిని సహించలేనంతగా ఎందుకు దిగజారిపోతావు చెప్పు? కేవలం అది మన ఫేట్! అంతేకానీ, తరువాత కాలంలో తెల్సింది- అవివేకంతో విడిపోయిన నాకు తప్ప మరో ఆడదానికి నీ హృదయంలో స్థానం లేదని! కోర్కెలు, వాంఛలు నీలోనే దిగమ్రింగుకుని నిర్జీవంగా బ్రతికిన నిన్నూ, నీ నిబద్ధతనీ చూసి చలించిపోయాను. నా భర్త అపర శ్రీరామచంద్రుడు, ఏకపత్నీవ్రతుడని పొంగిపోయాను. నీతో విడాకులు పొందాలనుకున్న ఆ తప్పిదానికి సిగ్గుపడుతున్నాను."

వణుకుతున్న గద్గదస్వరంతో భావావేశానికి లోనౌతున్న చరిత- అమృతవర్షిణిలా కనిపిస్తోందతనికి.

"నీతో కలిసి ఎంత దూరమైనా నడవాలనుకుంటున్నాను. ఐ వాంట్ టు మ్యారీ యూ ఎగైన్!" కనుకొలుకుల్లో మెరుపులా మెరుస్తున్న కన్నీళ్లు అతనికి కొత్తఅందాన్ని తెచ్చిపెడుతున్నాయి.

"ఇప్పుడే నిర్ణయం చెప్పనవసరం లేదు. ఇంటికి వెళ్లి బాగా ఆలోచించుకున్న తరువాతే చెప్పు!" అని వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళుతున్న అతనిలో హీరోయిజం కనబడుతోంది. ఆ నడకలో- 'ఇవి తప్పటడుగులు కావు... తప్పుటడుగులు అంతకన్నా కావు' అనే భావన గోచరిస్తోంది. ఆ కళ్ళు కరిగిపోయిన కల్మషాన్ని, తరిగిపోయిన అంతరాన్ని గుర్తుకుతెస్తుంటే... టోటల్‌గా అతని స్ఫురద్రూపం స్నేహహస్తాన్ని చాచి తన మమతల కోవెలలోకి మధురభావనతో ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది.

● ● ●

"జగమే మారినదీ మధురముగా ఈ వేళ!"

- టీ.వీ.లో వస్తున్న ఘంటశాల వారి గళం నుండి మధురంగా జాలువారుతున్న ఆనంద రాగంతో చరిత అంతరంగం వాస్తవలోకం లోనికి అడుగుపెట్టింది. ఆ పాటలాగే తన ఊహలు మధురంగా అన్పిస్తున్నాయి. నిజంగా జగమంతా మారిపోయి, మనోహరంగా కన్పిస్తోంది.

ఒక్కసారిగా తనలో ఎంత మార్పు?!

శ్రీవాత్సవ 'మరలా పెళ్ళిచేసుకొని, రెండోసారి దంపతులమౌదా' మంటున్నాడు. ఆ ఊహ చాలా ఆనందాన్ని ఇచ్చి, లేని బలాన్ని తెచ్చిపెడుతోందామెలో. ఈ విధమైన రెండోవివాహం చట్టసమ్మతమేనా? బహుశా చరిత్రలో ఎవరూ ఇటువంటి ప్రపోజల్ తీసుకొని వచ్చి ఉండరేమో!

ఊహల ఊయలలో ఊగుతూ, ఎటూ తేల్చుకోలేకపోతున్న ఆమె అంతరంగం ఒక్కసారి గట్టిపడి, దృఢచిత్తంతో మనసులోని భావనని కాగితంపై పెట్టసాగింది.

"ప్రియమైన శ్రీవూ!

నీ 'మళ్లీ పెళ్ళి' ప్రపోజల్- నాలో ఏనాడో నవ వధువుగా దాచుకున్న మధురానుభూతుల్ని వెలికితీసి, మనసు మాధుర్యంతో నిండిపోయింది. నీవంటి ఉత్తముణ్ణి ఆనాడు ఎందుకు దూరం చేసుకున్నానో ఈనాటికీ అర్థంకావడం లేదు. అది ఒక పీడకల! నీతో విడిపోయిన తరువాత ఏదో ఉద్యోగం చేశానేగానీ, మానసికంగా దిగజారి జీవచ్ఛవంలా బ్రతికాను తెలుసా? 'ఎదుటివారి చులకన భావం, అయినవారి సాధింపులు, నామీద నాకే నమ్మకం లేకుండా చేశాయి' అంటే నమ్మగలవా? కానీ, నీ నుండి దూరమైన తరువాత ఆ ఎడబాటు మాటున తీయదనం చిగురించింది.

ఇప్పుడు మనకేమిటి తక్కువ చెప్పు? జీవితాన్ని పంచుకోవటమంటే కలిసే కాపురం చేయాలంటావా? దానికి 'మళ్లీ పెళ్ళి' అవసరమంటావా? నాకు మటుకు ఇలాగే బాగుంది. నీ సహచర్యంలో ఈ క్షణం నుండి ఇతరుల వేధింపులు నా చెవుల్ని సోకడం మానేశాయి. ఇద్దరం మరలా పెళ్ళిచేసుకొని ఒకేచోట కాపురం పెడితే, గతంలోని తప్పులే పునరావృత మవుతాయేమోనని భయంగా వుంది. ఈసారి నిన్ను ఒదులుకోవడానికి సిద్ధంగా లేను. దీనిని నేను భిన్నత్వంలో ఏకత్వంగా భావిస్తాను.

నీవు... నీ ఉద్యోగం... నీ బ్రతుకు నీది!

నేను... నా ఉద్యోగం... నా జీవితం నాది!

కానీ, మంచి స్నేహితుల్లా, ఆత్మీయుల్లా, వైవాహిక సహజీవనాన్ని కొనసాగించవచ్చు. మనల్ని మొబైల్ మొగుడూ, పెళ్ళాలనుకోవచ్చునేమో! నా ఇంటికి నీవు ఎప్పుడైనా రావచ్చు. ఎంతకాలమైనా ఉండొచ్చు. రావాలనుకున్నప్పుడు నీ ఇంటికి నేనూ వస్తుంటాను. ఇద్దరం ఎక్కడైనా కలిసి తిరగొచ్చు. ఇంక పిల్లలంటావా? ఇప్పుడు పిల్లల్ని కనే ఓపికా... కోరికా... తీరికా నాకు లేవు.

కలబాటు మనల్ని విడదీస్తే- ఎడబాటు మార్గాన్నే ఎన్నుకుంటే మంచిదని నా అభిప్రాయం. నా మాటకు ఎప్పుడూ విలువనిచ్చే నీవు- ఇప్పుడూ మన్నిస్తావనుకుంటున్నాను.

ఇట్లు
నీ
సహచరి."

కథా నిలయం 55539 శ్రీకాకుళం

ఒక సున్నితమైన సమస్యను అంతే సున్నితంగా ప్రస్తావించి,
పరిష్కారం చూపడానికి చేసిన ప్రయత్నం ఈ కథ. కొత్తకోణంలో, కొత్తగా ప్రెజెంట్ చేసిన కథ.
అందుకే నిడివి ఎక్కువైనా ఈ సంకలనంలో ప్రచురించాం.
ఈ కథపై పాఠకుల అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.

- జయంతి పబ్లికేషన్స్